



పై ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం.. సిరికొండ మండలం మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నిజాంగూడ. ఈ గ్రామంలో మంచినీటి బావి వద్ద గ్రామస్థులు పడుతున్న కష్టాలు ఇవి. గ్రామ సమీపంలో ఉన్న ఒకే ఒక బావిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుక పోయాయి. దీంతో గ్రామస్థులు అంతా కలిసి పూడిక బురదను తొలగిస్తూ మంచినీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఈ గ్రామంలో 60-70 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతియేటా వేసవిలో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని నిజాంగూడ గ్రామస్థులు వాపోతున్నారు.



అడుగంటి కనిపిస్తున్న మంచినీటి బావి

పల్లె కన్నీరు

» జిల్లాలో గిరిజన గ్రామాలకు వ్యవసాయ బావులే దిక్కు » ఏళ్లు గడుస్తున్నా.. దరిచేరని మిషన్ భగీరథ » కలుషిత నీటితో చుట్టుముడుతున్న వ్యాధులు » కాగితాలకే పరిమితమవుతున్న సమ్మర్ యాక్షన్ ప్లాన్ » గ్రామాల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేక అధికారులు » జిల్లావ్యాప్తంగా 473 గ్రామ పంచాయతీల పరిధిలో 1231 గ్రామాలు

ఆదిలాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు బిందెడు నీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతియేటా వేసవి సీజన్‌లో గిరిజనులకు కన్నీటి గోసనే కనిపిస్తుంది. అందుబాటులో ఉన్న వ్యవసాయ బావులను ఆశ్రయిస్తూ దాహం తీర్చుకుంటున్నారు. వేసవి పరిస్థితులను గటెక్కేందుకు అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలను చేపడుతున్నా తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. జిల్లాలో 473 గ్రామ పంచాయతీల పరిధిలో 1231 గ్రామాలు ఉన్నాయి.



2023 మార్చి 18న ఇంద్రవెల్లిలో గిరిజనుల నీటి కష్టాలను పరిశీలిస్తున్న ఆనాటి సీఎల్పీ నేత, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఇప్పటి వరకు 1,227 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికీ వందలాది గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందడం లేదంటున్నారు. ముఖ్యంగా జిల్లాలో నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ, తలమడుగు మండలాల్లో తీవ్రమైన నీటిఎద్దడి సమస్య ఎదురవుతోంది. అయినా అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయక పోవడంతో నీటికష్టాలు తీరడం లేదు. గ్రామాల సమీపంలో ఉన్నవాగులు, ఒర్రెలు, బావులు కలుషితమైన చెలిమె నీటిని తాగడంతో అంతుచిక్కని వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఉన్న మంచినీటి పథకాలు పని చేయక పోవడంతో అలంకార ప్రాయంగానే కనిపిస్తున్నాయి. ఎండలు దంచికొడుతున్న మే మాసం లో నీటిఎద్దడి సమస్య మరింత తీవ్రరూపం దాల్చడంతో గిరిజనులతో పాటు గొడ్డు గోదా నీళ్ల కోసం అల్లాడుతున్నాయి. ఏప్రిల్ మాసం చివరి నాటికి జిల్లా సగటు భూగర్భ జలమట్టం 8.82 మీటర్లకు పడిపోయింది. దీంతో భూగర్భ జలాలు మరింత వేగంగా పడిపోతున్నాయి. అయితే ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. గత ఏడేళ్లుగా మిషన్ భగీరథ గిరిజన గ్రామాలకు అందనంత దూరంలోనే కనిపిస్తోంది.

అల్లాడుతున్న గిరిజనులు

మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో మంచి నీటిఎద్దడి తీవ్ర రూపం దాల్చడంతో గిరిజన గూడాలు అల్లాడుతున్నాయి. ప్రధానంగా సిరికొండ మండలం మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నిజాంగూడ గ్రామంలో

(తరువాయి 6వ పేజీలో...)

తాగునీటికి వ్యవసాయ బావే దిక్కు

: కుడిమెత బండు పటేల్, నిజాంగూడ గ్రామం, సిరికొండ మండలం



మిషన్ భగీరథ ద్వారా అడపదడపగా నీటిని సరఫరా చేయడంతో వ్యవసాయ బావులే దిక్కవుతున్నాయి. మండిపోతున్న ఎండలకు భూగర్భజలాలు సైతం అడుగంటుక పోతున్నాయి. మా గ్రామ సమీపంలో ఉన్న ఒకే ఒక బావిలో కూడా నీరు అడుగంటింది. దీంతో ప్రతీరోజు బురద నీటిని తొలగించి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. కలుషిత నీటితో గ్రామస్థులు అనారోగ్య బారిన పడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

: చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఆదిలాబాద్

జిల్లాలో ఎక్కడైనా నీటి ఎద్దడి సమస్య తలెత్తితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఏదైనా సమస్య వస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. సిరికొండ మండలం నిజాంగూడలో నీటి సమస్య తలెత్తిన విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి చర్యలు చేపడుతాం.



ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాపురావును ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న ఆదివాసీలు

ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

ఉట్నూర్, మే 6(ఆంధ్రజ్యోతి): గుడిహత్నూర్ మండలం లోని మాన్కాపూర్‌లో తొడసం పరివార్ ఆధ్వర్యంలో నిర్మించిన పెర్సపెయిన్ ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పురక బాపురావును ఆదివాసీ గిరిజనులు ఆహ్వానించారు. మండల కేంద్రంలోని ఎత్మనూర్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాపురావును కలిసి కటోడ తొడసం భీమ్రావు, తొడసం దేవరావు, మేస్రం దుర్గుపటేల్, తదితరులు ఆహ్వానించారు.

నేడు కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం

ఆదిలాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో నియోజక వర్గ స్థాయి ముఖ్యనేతల సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, పరిశీలకులు, ఉర్దూ అకాడమిక్ ఛైర్మన్ తాహెర్‌బిన్ నందన్, టీపీసీసీ కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

.. 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు'

నేరడిగొండ, మే 6(ఆంధ్రజ్యోతి): రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం నేరడిగొండ రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందని నేరడిగొండ వ్యవసాయ అధికారి కృష్ణవేణి అన్నారు. రైతు సోదరులు వానాకాలం పంటల సాగు, విత్తన నాణ్యత, విత్తనశుద్ధి, తదితర అంశాల గురించి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ శాస్త్రవేత్తల ద్వారా కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు సకాలంలో హాజరై వారివారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలి : పశు వైద్యాధికారి

నేరడిగొండ, మే 6(ఆంధ్రజ్యోతి): పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత పశు పోషకులు, రైతులపై ఉందని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగమల్యాల్, గోవిందపూర్, పీచర గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని అన్నారు. పశువులకు వ్యాధులు సోకుండా ముందుస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

నేరడిగొండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయి లింగి వృద్ధాశ్రమంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమంలోనే రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులను పంపిణీ చేశారు. వేసవికాలంలో వయోవృద్ధులు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వయోవృద్ధుల పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఇందులో మండల వైద్యాధికారి డాక్టర్ రిటైర్డ్ ఆర్మీ అధికారి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

గుడిహత్నూర్, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో ఏఈఓలు విత్తనాల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా షాపుల యజమానులు ప్రభుత్వ అనుమతి ఉన్న గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు విక్రయించాలన్నారు. విత్తనాలు మందుల కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. ఈ సమావేశంలో ఎస్సై మహేందర్, ప్రొబేషనరి ఎస్సై ముద్దుకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ భాగ్యలక్ష్మి, ఏఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో రమేష్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఏడీబీ ఆకారంలో ఉన్న ఆటోలు

పాత వాహనాలు కొంటున్నారా.. జాగ్రత్త!

● ఆటోలు దొంగలించిన అంతర్ రాష్ట్ర ముఠా అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): సెకండ్ హ్యాండ్ వాహనాలు, పాత వాహనాలను తక్కువ ధరకే వస్తున్నాయని కొంటున్నారా..? అయితే తస్మాత్ జాగ్రత్త..! అంటున్నారు పోలీసులు.. తాజాగా ఓ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా 27 ఆటోలను దొంగలించి నెంబర్ ప్లేట్లు, ఇంజన్ నెంబర్ మార్చేసి అమాయక ప్రజలకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి వాహనాలను ప్రజలు తక్కువ ధరకే వస్తున్నాయని, సెకండ్ హ్యాండ్, పాత వాహనాలు తీసుకుంటే నేరాల్లో ఇరుకున్నదేనని జిల్లా పోలీసులు సూచిస్తున్నారు. కాగా ఈ ఆటోల దొంగతనానికి పాల్పడ్డ అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించి సమయంలో షారుఖ్ పఠాన్ ఆదిలాబాద్ లో దొంగలించబడిన ఆటోతో అనుమానస్పదంగా పట్టుబడ్డాడని, అతనిని విచారించగా ఏడుగురు ముఠా సభ్యులు అందరూ కలిసి హైదరాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఆటోలను దొంగలించి వాటి వాహన నెంబర్‌లు, ఇంజన్ నంబర్‌లు మార్చి వాటి స్థానంలో కొత్త నకిలీ నెంబర్‌లు మార్చి అమ్మడానికి సిద్ధంగా ఉన్న సమయంలో జిల్లా పోలీసులు వారిని పట్టుకొని కేసును చేదించారని తెలిపారు. నిందితుడు షారుఖ్ పఠాన్‌ను విచారించగా.. అల్తాఫ్ ఖాన్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడ షేక్ ఖయ్యూం, 15 ఆటోలు, తదుపరి వీరందరూ అఫ్సర్ బేగ్, అసద్ ఖాన్ ఇంటి వద్దకు తీసుకు వెళ్లగా వారి వద్ద 11 ఆటోలు లభ్యమయ్యాయని తెలిపారు. వీరిపై హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు ఆరు కేసులు నమోదయ్యాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఐదుగురు ప్రధాన నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న యూసఫ్,సయ్యద్ ల పథకం ప్రకారం ఆటోలను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో దొంగలించి వాటిని ఇక్కడికి తీసుకువచ్చి అమ్మడానికి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ప్రధాన నిందితులను పట్టుకోవడంలో జిల్లాలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి త్వరలో వారిని పట్టుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, దొంగలను పట్టుకోవడంలో జిల్లా పోలీసు యంత్రాంగం ముందుంటుందని, జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పిస్తుందని తెలిపారు. మొత్తం వీరందరి వద్ద 27 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.27 లక్షల వరకు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు పాత వాహనాలను కొనేముందు అన్ని పత్రాలను సరిచూసుకొని అన్ని ధ్రువీకరించుకున్న తర్వాతే కొనాలని సూచించారు. ఒరిజినల్ పేపర్స్ లేకుండా వాహనాలను కొనకూడదని తెలిపారు. దొంగలించిన వాహనాలను కొంటే, కొన్నవారు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు క్రిమినల్ కేసులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఎస్పీ సూచించారు. దొంగలను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన రూరల్ సీఐ కే ఫణిందర్ సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ముజాహిద్, సీసీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే.ఫణిధర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ చంద్రశేఖర్, ఎస్సై సయ్యద్ ముజాహిద్, రూరల్, సీసీఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఇందిరమ్మ లబ్ధిదారుల సర్వే పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, రామ్‌నగర్, భాగ్యనగర్ మున్సిపల్ పరిధిలో గల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు విస్తృతంగా ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను, చెక్ లిస్ట్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా కేఆర్‌కే కాలనీలో 60 ఏళ్ల గల సలీమ బేగం, షేక్ పర్వీన్, ఆర్‌సీసీ, ఖాన్ చోటి బీ స్థలం సరిగా లేకపోవడం, అలాగే రాంనగర్, భాగ్యనగర్‌లలో ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రాథమిక జాబితాలులో ఉన్న పేర్లను మరోసారి వెరిఫికేషన్‌కు చేయాలని, అన్ని కోణాల్లో పరిశీలించి లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అంతకుముందు గూగుల్ మీట్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించి ఈ సందర్భంగా మొత్తం అప్లికేషన్‌ల ధ్రువీకరణ 6886 పూర్తయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల 6685 మంజూరు కోసం కలెక్టర్ లాగిన్‌కి పంపబడిన మొత్తం దరఖాస్తులు మొత్తం అప్లికేషన్‌లు ఎంసీ ఎంపీడీఓలు 521కు మార్చబడ్డాయి. 60ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నట్లు చూపుతోందని, సీఈవో తెలిపారు. రూఫ్‌ను ఆర్‌సీసీ స్లాబ్‌గా చూపిస్తూ, పైన పేర్కొన్న దరఖాస్తులను కుటుంబంతో కలిసి 60ఏళ్ల పైబడి ఉన్నట్లయితే వాటిని ధ్రువీకరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇలాంటి వాటిని ఇళ్ల మంజూరుకు పరిగణించవచ్చునని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని ఆదేశించారు. వారు అర్హులని గుర్తిస్తే ప్రతిపాదనల్లో చేర్చాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు, మున్సిపల్ సిబ్బంది, వీఆర్వో ఉన్నారు.

'పాకిస్తాన్, బంగ్లా దేశస్తులను ఇండియా నుంచి తరలించండి'

ఆదిలాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపుమేరకు ఆదిలాబాద్ జిల్లా, అదిలాబాద్ రూరల్ మండలంలో అక్రమంగా ఉంటున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను గుర్తించి వారిపై చట్టపరమైన రీతిలో చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ రూరల్ మండలం బీజేపీ ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహసీల్దార్ సాయి మహేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ రూరల్ మండలం అధ్యక్షుడు బంతిపెల్లి దయాకర్, మండల నాయకులు ఉగ్గె సత్యం, బండారి రమణ, దొర్నెట్టి ఆనంద్, చరణ్ గౌడ్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బేల: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నిక్కం దత్త మాట్లాడుతూ గత నెలలో జమ్మూకశ్మీర్‌లోని పహాల్గాంలో ఉగ్రవాదుల దాడులో అమాయక ప్రజల ప్రాణాలు తీయడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆదేశాల మేరకు అన్ని మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా పాకిస్తాన్, బంగ్లాదేశ్ వాసులు నివాసం ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి ఇక్కడి నుంచి పంపించాలని కోరారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జిల్లావ్యాప్తంగా భానుడి భగభగలు

● రోజురోజుకూ మండిపోతున్న ఎండలు ● అత్యధికంగా తలమడుగు మండలంలో 42.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత ● ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం

ఆదిలాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడి భగభగలకు ఎండల తీవ్రత కనిపిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు దంచికొడుతున్న సాయంత్రం వేళల్లో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురుస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి.మంగళవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 25.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యధికంగా తలమడుగు మండలంలో 42.6 డిగ్రీలు కాగా బేలలో 42.4, జైనథ్‌లో 42.1, మావలలో 40.8, గాదిగూడలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపుగా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో విపరీతమైన ఎండలకు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయంత్రం వేళల్లో ఈదురు గాలులు భీభత్సవాన్ని సృష్టిస్తున్నాయి. తీవ్రమైన వడగాలుల ప్రభావంతో జనం బయటకెళ్లేందుకే జంకుతున్నారు. అంతేకాకుండా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉన్నందున అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



● జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా కనిపిస్తున్న ప్రధాన రహదారి





● ఎండ తీవ్రతకు స్కార్ఫ్‌ను ధరించి వెళ్తున్న ప్రయాణికులు, పాదచారులు

ముస్తాబైన గూడ వేంకటేశ్వర ఆలయం

● నేడు స్వామివారి కల్యాణోత్సవం

జైనథ్, మే 6(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలోని గూడ గ్రామంలో బుధవారం వేంకటేశ్వర ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం, కల్యాణ మహోత్సవం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు గూడ గ్రామ ప్రజలు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నిత్యహోమం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగు రంగుల పూలతో పాటు వివిధ రంగులతో కూడిన విద్యుత్ మెర్క్యురి బల్బులతో అందంగా ముస్తాబు చేశారు.

కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ఉట్నూర్, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ముందు వేతనాల కోసం రెండవ రోజు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ బొంకంటి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందర నల్లబ్యాడ్జిలు ధరించి ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుభాబొంకంటి వతూఆరు. ఈ కార్యక్రమంలో భానుప్రసాద్, అమర్‌సింగ్, వెంకటేశ్, మోహిన్, అరుణ్, గంగాధర్, వీణ, యశోధ, రమ, దీప, అంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

'బంజారాల సమస్యలపై పోరాడాలి'

నార్నూర్, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బంజారాల సమస్యలు, హక్కులపై అసెంబ్లీలో పోరాడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద నాయక్ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితి, సమాజ అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి బంజారాల సమస్యలపై విన్నవిస్తు వాటిని పరిష్కారం చేసే దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాజీ శ్రీరాం, మాజీ జేఏసీ ఛైర్మన్ ఉత్తం రాథోడ్, మాజీ ఎంపీపీ సజన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

'కగార్ ఆపరేషన్ నిలిపి వేయాలి'

ఉట్నూర్, మే 6(ఆంధ్రజ్యోతి): కర్రెగుట్టలో నిర్వహిస్తున్న కగార్ ఆపరేషన్‌ను ప్రభుత్వాలు వెంటనే నిలిపి వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ కగార్ ఆపరేషన్‌తో ఆదివాసీ గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం అనుకొని విస్తరించి ఉన్న కర్రెగుట్టలు ఏజెన్సీ భూ ప్రాంతంలో ఉన్నాయని అన్నారు. ఇది ఐదవ షెడ్యుల్డు భూభాగంలో తెలంగాణలోని దట్టమైన కొండల మధ్య ఉందన్నారు. ఈ ఆపరేషన్‌తో ఇటు ఆదివాసీలు, అటు వన్యమృగాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఇందులో తొడసం ఇంద్రు, కొమ్రం జైతు, పూసం ఇస్రుఅరక గోవిందరావు, పూసం దేవరావులు పాల్గొన్నారు.

పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

తలమడుగు, మే 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం సాగు చేసే రైతులు అధిక దిగుబడి కోసం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్ర ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ కోరారు. మంగళవారం మండలంలోని లక్ష్మంపురం గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్త కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలన్నారు. అంతే కాకుండా భూమి తల్లిని రక్షించేందుకు తక్కువగా రసాయన ఎరువులు వాడాలని సూచించారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ఇందులో శాస్త్రవేత్తలు డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ శివకుమార్, వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ లావణ్య, ఏఈఓ కీర్తి, వేసా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మేడిగూడ(ఆర్)లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ ఛైర్మన్



జైనథ్ మార్కెట్‌లో రైతులకు అన్నం వడ్డిస్తున్న నాయకులు

జొన్న పంట ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

● ఆదిలాబాద్ డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి

జైనథ్, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులు పండించిన వివిధ పంటలకు సంబంధించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తుందని ఆదిలాబాద్ డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల పరిధిలోని మేడిగూడ(ఆర్) గ్రామంలో జొన్న పంటల కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ నాఫెడ్ అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3371లతో రైతులు అమ్ముకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ ఆర్ పీఏసీఎస్ ఛైర్మన్ ఇప్పపొతన్న, సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్, జైనథ్ మార్కెట్ ఛైర్మన్ ఎ.అశోక్ రెడ్డి, జైనథ్ ఆలయ కమిటీ ఛైర్మన్‌లు ఎ.రూకేష్‌రెడ్డి, మాంగూర్ల ఎంపీటీసీ పి.దేవన్న, నాయకులు అస్తక్ సుభాష్, వీడీసీ ఛైర్మన్ కె.రాంరెడ్డిలతో పాటుఆయా గ్రామాల జొన్న రైతులు పాల్గొన్నారు.

● పాయల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో జొన్న పంటను విక్రయిస్తున్న ఆయా గ్రామాల రైతులకు మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల ఫౌండేషన్ ఛైర్మన్ పాయలశంకర్ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ జైనథ్ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో రైతులకు అన్ని సౌకర్యాలు మద్ధతు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జైనథ్ మండల ఉపాధ్యక్షుడు ఎన్.ప్రతాప్ యాదవ్, బింగివెంకన్న, నాయకులు నూకల లస్మన్న యాదవ్, సీహెచ్ రవిలతో పాటు ఆయా గ్రామాల జొన్న రైతులు పాల్గొన్నారు.



జొన్న పంట తూకం చేయాలని వినతిపత్రం ఇస్తున్న రైతులు

హమాలీలు రాకపోవడంతో బోథ్‌లో నిలిచిన జొన్నల తూకం

బోథ్, మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న పంట తూకం వేసేందుకు హమాలీలు రాకపోవడంతో పంట తూకం వేయడం నిలిచిపోయింది. సోమవారం నిబంధనలకు విరుద్ధంగా హమాలీ వసూలు చేస్తున్నారంటూ రైతు ఫిర్యాదు చేయడంతో ఈ విషయమై మార్కెట్ కమిటీ ఛైర్మన్ కార్యదర్శిలు హమాలీలను హమాలీ డబ్బు ఎక్కువ తీసుకుంటున్నారు అన్న విషయమై అడగడం జరిగింది. దీంతో హమాలీలు తమకు క్వింటాలుకు రూ.38 ప్రభుత్వం నిర్ణయించిన ధర గిట్టుబాటు కాదని తేల్చి చెప్పారు. 50 రూపాయలు ఇస్తేనే తూకం వేస్తామని హమాలీలు భీష్మించుకొని కూర్చున్నారు. అయితే మంగళవారం ఈ విషయమై మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సెక్రెటరీ విట్టల్‌లు హమాలీలను పిలవడం జరిగింది. అయితే హమాలీలు మాత్రం రాకుండా ఉండడంతో తూకం జరగలేదు. దీంతో మార్కెట్‌కు జొన్న పంటను తీసుకువచ్చిన రైతులు తొందరగా సమస్యను పరిష్కరించి తూకం జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తొందరగా కొనుగోలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించామన్నారు. ఏది ఏమైనా సోమవారం జరిగిన సంఘటనతో మంగళవారం తూకం నిలిచిపోయింది.

'రైతులకు కుచ్చుటోపి పెట్టిన కాంగ్రెస్'

ఆదిలాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా పత్తి రైతులు నిలువునా మోసపోయారని, స్థానిక ఎమ్మెల్యే హస్తంతో ప్రైవేట్ డీలర్లతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రైతులకు కుచ్చుటోపీ పెట్టారని రాజమంత్రి జోగు రామన్న ఆరోపించారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ చేపట్టిన పత్తి కొనుగోళ్లలో రూ.కోట్లు అక్రమాలు జరిగాయని, ప్రభుత్వం చూపిన లెక్కలకు, కొనుగోలులో జరిగిన లెక్కలకు ఏమాత్రం పొంతనలేదని, వెంటనే పత్తి కొనుగోళ్లపై జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో మొత్తం 25 లక్షల మంది పత్తి రైతులు సాగు చేసిన పత్తితో 49 లక్షల బేళ్ల ఉత్పత్తి అయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నామని అన్నారు. ఇందులో 41 లక్షల బేళ్లు సీసీఐ ద్వారా ఖరీదు చేసినట్లు చెబుతున్నారని, మరో ఎనిమిది లక్షల బేళ్లు ప్రైవేట్ వ్యాపారాలు కొనుగోలు చేసినట్లు లెక్కలు ఉన్నాయన్నారు. అయితే సీసీఐ కేవలం ఆరున్నర లక్షల మంది రైతుల నుంచే పత్తి కొనుగోలు చేసినట్లు ఉందన్నారు. దీపావళి పండుగ రోజున హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేతలు, ప్రైవేట్ వ్యాపారస్తులతో సమావేశమై రైతులను నిలువునా మోసం చేసే యత్నాలు ప్రారంభించారని ఆరోపించారు. తాను గతంలోనే హెచ్చరించిన విధంగా స్థానిక ఎమ్మెల్యే సైతం అందుకు సహకరించారని, తప్పుల తడకగా ఉన్న లెక్కలపై విచారణ జరపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ మెట్టు ప్రహ్లాద్, అశోక్ స్వామి,అడప తిరుపతి, ఆలం, నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

బేల, మే 6(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్సై నాగనాథ్ అన్నారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను బీజేపీ నాయకులు మంగళవారం కలిశారు. వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇంద్రశేఖర్, దత్తా నిక్కం, రాకేష్,గణేష్, నవీన్, రాము, శివ కుమార్, మహేష్ ప్రమోద్ రెడ్డి, దినేష్ పాల్గొన్నారు.

క'న్నీటి' గోస!

(5వ పేజీ తరువాయి...)

తాగునీటి కోసం ఆదివాసీ గిరిజనులు అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీరు వారానికి ఒకసారి రావడంతో నీటి కష్టాలు తప్పడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటి వరకు ఇంటింటికీ మంచినీటి కనెక్షన్‌ను కూడా ఇవ్వక పోవడంతో అడపాదడప సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీరు వృథాగానే పోతోంది. అధికారులు మాత్రం అన్ని గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. తొలకరి వర్షాలు కురిసే వరకు ఇవే పరిస్థితులు ఉంటే విషజ్వరాలు, అతిసారా లాంటి వ్యాధుల బారీన పడే ప్రమాదం ఉంటుందని గిరిజనులు వాపోతున్నారు. అధికారులు కనీసం తాగేందుకైనా మంచి నీటి సౌకర్యాన్ని కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ అధికారులు గిరిజన గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. గ్రామాలలో ఎన్నో ఏళ్ల క్రితం తవ్వుకున్న మంచినీటి బావులే దిక్కవుతున్నాయి. ఎండలకు వ్యవసాయ బావులు సైతం అడుగంటుక పోతున్నాయి. తొలకరి వర్షాలు ఆలస్యమైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందంటున్నారు.

గొంతు తడపని 'మిషన్ భగీరథ'

మారుమూల గిరిజన గ్రామాలకు మంచినీటిని అందించాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. కాణబూ ఏడేళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో గిరిజన గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు సరఫరా కావడం లేదు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తున్న శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదంటున్నారు. మెయిన్ పైపులైన్‌తో బల్క్ వాటర్‌ను సరఫరా చేస్తున్న ఇంటింటికి మంచినీటి సరఫరా చేసే పైపులైన్‌లను ఏర్పాటు చేయక పోవడంతో తాగు నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంచినీటి కష్టాలతోనే వేసవి కాలం ముగిసిపోతున్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదంటున్నారు. మారుమూల గిరిజన గ్రామాల వైపు ఆర్‌డబ్ల్యూఎస్, ప్రత్యేక అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అందుబాటులో ఉన్న నీళ్లతోనే దాహం తీర్చుకుంటున్నారు. గతంలో నిర్మించిన పథకాలపై పర్యవేక్షణ లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో ప్రపంచ బ్యాంకు, ఐటీడీఏ, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్, సింగిల్ విలేజ్ స్కీం, గ్రౌండ్ లెవల్ సర్వీస్, రిజర్వాయర్, ఓవర్ హెడ్ సర్వీస్, మొదలగు పథకాల కింద రూ.కోట్లు ను ఖర్చు చేసినా గిరిజనుల దాహం తీర్చిన దాఖలాలు కనిపించడం లేదు.

అధికారుల హడావుడి

ప్రతియేటా వేసవి కాలం ప్రారంభంకాగానే సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత అంతా మరిచిపోవడంతో ప్రజలకు మంచినీటి కష్టాలు తీరడం లేదు. ఈ యేడు తాత్కాలిక మరమ్మతులు, అవసరాల కోసం రూ.3 కోట్లకు పైగా నిధులు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అత్యవసరమైన చోట నిధులను ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. నిధుల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. వేసవి ప్రారంభంలోనే సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో ఉరుకులు పరుగులు పెడుతున్న అధికారులు తీవ్రమైన ఎండలు, నీటిఎద్దడి తలెత్తె ఏప్రిల్, మే మాసాలలో గ్రామాల వైపు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు. గ్రామాల్లో పంచాయతీల పాలక వర్గం పదవీ కాలం ముగిసి పోవడంతో ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. మండల, గ్రామ స్థాయి అధికారులు అడపాదడప గ్రామాలకు వెళ్తున్నా.. నీటి సమస్యపై పెద్దగా దృష్టి సారించడం లేదంటున్నారు. సొంత శాఖ పనులకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

చెరువు మట్టి పంట పొలాలకు పౌష్టికరం

తలమడుగు, మే 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న చెరువులో పూడికతీత కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఉండం చెరువులో ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఓ మేఘమాలలు పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఉపాధితో పాటు రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేపడుతున్నామని, ముఖ్యంగా చెరువులో మట్టిని రైతులు తమ పంట పొలాల్లో వేసుకుంటే పంటలకు ఎంతో పౌష్టికరమని వారు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజలకు బీజేపీపై విశ్వాసం పెరిగింది

● రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు
● మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు,
● నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామచందర్

నిర్మల్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలతో బీజేపీ పార్టీ ప్రజలకు చేరువయ్యిందని, దీంతో బీజేపీపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సంఘటన సంరచనా పర్వ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షులకు, సంఘటన సంరచనా ప్రభారీలకు మండల కమిటీ సభ్యుల నియామకంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీలను ప్రణాళికబద్ధంగా నిర్మాణం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. గతంలో గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో కమిటీలే క్రియాశీల పాత్ర పోషించాయని వారు తెలిపారు. బీజేపీ స్వరూపం దేశవ్యాప్తంగా విస్తరిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ అధికారంలోకి వస్తుందని, గ్రామ గ్రామానికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యపరచాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ మహిళలకు పెద్దపీట వేస్తోందని, రాబోయే ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించి, సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ప్రభారీ బసవపురం లక్ష్మీ నర్సయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పడిగెల గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్, ఆరోగ్య, అసెంబ్లీ కన్వీనర్లు అంకం మహేందర్, తాడేవార్ సాయినాథ్, సుమన్, జిల్లాలోని మండల అధ్యక్షులు, ప్రభారీలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కుభీర్ మండల కేంద్రంలో దాహార్తి తీర్చండి

కుభీర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండుతున్నాయి. ఈ నెలాఖరు వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనావాసాల్లో, వార సంతల్లో, కార్మికులు ఎక్కువగా పని చేసే ప్రాంతాలు వ్యాపార కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మండల కేంద్రానికి వచ్చే చిరు వ్యాపారులు మండల వాసులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుండి నీళ్ల సీసాలు తెచ్చుకుంటే గంట సేపటికే వేడిగా అవుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో రూ. 20-30 వెచ్చించి నీళ్ల సీసాలు కొనుక్కోవాల్సి వస్తోంది. గత సర్పంచ్ మీరా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్, బజార్‌లైన్, అన్నబావుసాతే కూడలిలో, వివేకానంద చౌరస్తాలో, సిద్దంవార్ జయరాం మాస్టర్‌కుమారుడు నిరంజన్ మున్నూర్‌కాపు సంఘ భవనం ముందు మార్చి నెల ప్రారంభం నుండి జూన్ నెల ప్రారంభం వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహర్తి తీర్చారు. ఈ వేసవిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఒక చలివేంద్ర ప్రారంభించారు నిర్వాహణ మరిచారు. దీంతో మధ్యాహ్నం వేల నీటి కసం తల్లడిల్లుతున్నారు. గత మాదిరిగానే జీపీ ఆధ్వర్యంలో సుమారు 5చలివేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరం ఉంది. దాహం తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య వర్తక సంఘాలు , యువజన సంఘాలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

రసాభాసగా

ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం

● దూమరం రేపిన బాసర మాజీ సర్పంచ్ రమేష్ వ్యాఖ్యలు ● తీవ్రస్థాయిలో వాదులాడుకున్న నారాయణరావ్ పాటిల్, విఠల్‌రెడ్డి వర్గీయులు ● తీరుమార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామన్న పీసీసీ పరిశీలకులు అవేజ్ ● పీసీసీ పరిశీలకుని వ్యాఖ్యలతో ఆందోళనలకు దిగిన విఠల్‌రెడ్డి వర్గీయులు ● ఆగ్రహావేశాలు వ్యక్తం చేసి పరిస్థితిని చక్కదిద్దిన మరో పరిశీలకుడు చంద్రశేఖర్‌గౌడ్



నారాయణరావ్ పాటిల్, విఠల్ రెడ్డి వర్గీయుల వాగ్వాదం



పీసీసీ పరిశీలకుడు అవేజ్‌ను నిలదీస్తున్న విఠల్‌రెడ్డి వర్గీయులు

భైంసా, మే 6 (ఆంధ్రజ్యోతి) : పార్టీ సంస్థాగత ఎన్నికల కోసం గాను మంగళవారం భైంసాలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముథోల్ నియోజకవర్గ సన్నాహక సమావేశం రసాభాస కొనసాగింది. మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్‌పాటిల్, విఠల్‌రెడ్డి వర్గీయులు సమావేశం ఆద్యంతం ప్రతి విషయానికి తలపడ్డారు. సమావేశం ప్రారంభంలో బాసర గ్రామ మాజీ సర్పంచ్ మామ్మయి రమేష్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, వర్గీయులపై చేసిన వ్యాఖ్యలతో మొదలైన దూమరం చివరి వరకు కొనసాగింది. ఒక వర్గంపై మరో వర్గం కాచుక కూర్చొని రచ్చ చేశారు. బాసర మాజీ సర్పంచ్ మామ్మయి రమేష్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వర్గీయులు ఆందోళనలకు దిగారు. వేదిక వద్దకు దూసుక వచ్చి నిరసనలకు దిగారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వర్గీయులు సైతం వేదిక వద్దకు దూసుకవచ్చి వాగ్వాదానికి దిగారు. దీంతో రెండు వర్గాలు పరిశీలకుల ముందే తీవ్రస్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ రభస చేశారు. గంటపాటు రెండు వర్గాలు వాగ్వాదాలు చేసుకుంటూ తోపులాటలకు దిగాయి. చివరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, భైంసా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రేలు ఇరు వర్గాలను సముదాయించి శాంతపరిచారు. తిరిగి సమావేశం ప్రారంభమయ్యే సమయంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు సూర్యంరెడ్డి మాట్లాడుతుండగా పీసీసీ పరిశీలకులు అవేజ్ ఆయనను నిలువరించే ప్రయత్నం చేశారు. ఇందుకు విఠల్‌రెడ్డి వర్గీయుల అభ్యంతరం తెలిపారు. దీంతో పీసీసీ పరిశీలకులు అవేజ్ సమావేశం సజావుగా సాగనీయకుంటే సస్పెండ్ చేస్తానని వ్యాఖ్యనించాడు. ఈ వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ మాజీ విఠల్‌రెడ్డి వర్గీయులు ఆయనను చుట్టుముట్టి నిలదీసారు. ఈ క్రమంలో పరిస్థితి మరోసారి రసాభాసగా మారింది. ఇదే అదనుగా రెండు వర్గాలు మరోమారు అరుపులు,కేకలు వేసుకుంటూ ఆందోళనలకు దిగారు. పరిస్థితి చేయిదాటి పోతుండటాన్ని పసిగట్టిన మరో పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్ తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అందరూ సంయమనంతో వ్యవహరించాలంటూ హెచ్చరించారు. తమ వర్గీయులను సముదాయించి తీరు మార్చుకోవాలని సూచించాలని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మైక్ అందుకొని తమ వర్గీయులను సముదాయించి శాంతపరచడంతో సమావేశం తిరిగి మరోమారు ప్రారంభమయ్యింది.

● సంస్థాగతంగా బలోపేతమైతేనే కాంగ్రెస్ శ్రేణులకు భవిష్యత్తు

దశాబ్దకాలంగా బీఆర్ఎస్ పాలనలో అటుపోట్లు బారిన పడి కష్ట నష్టాలను ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంస్థాగతంగా బలోపేతమైతేనే భవిష్యత్తు ఉంటుందని పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, ఎండీ అవేజ్‌లు పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం సంస్థాగతంగా కాంగ్రెస్ పటిష్ఠతకు,బలోపేతానికి పకడ్బందీ చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పటిష్ఠతకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడిందన్నారు. పార్టీ శ్రేణులు బేధాభిప్రాయాలు విడనాడి సంస్థాగత కార్యవర్గాలను ఐక్యతతో నిర్వహించుకోవాలన్నారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో జరగుతున్న సంక్షేమాన్ని, చేపడుతున్న ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు.. పార్టీ నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతట వారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

● ఐక్యతారాగం ఆలపించిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు

పార్టీ పీసీసీ పరిశీలకుల ఆదేశాలతో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్ పాటిల్, డా. ఎస్.వేణుగోపాలచారి, విఠల్‌రెడ్డి ఐక్యతారాగం ఆలపించారు. తామందరం బేధాభిప్రాయాలకు తావులేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. సమన్వయంతో ముందుకు సాగుతూ సమిష్టిగా కృషి చేసి సంస్థాగత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులందరిని గెలిపించుక తీరుతామని వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ అవినీతి , అక్రమాలకు పాల్పడితే పార్టీ వారైనా ఉరుకోబోనని, పోలీసు కేసులు పెట్టిస్తానని తెలిపారు.



ఆందోళనకు దిగిన కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్



వేదికపై ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు

రేపటి నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

● జిల్లాలో ఆరు గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు

ముథోల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : వానకాలం సాగుకు రైతాంగాన్ని పూర్తిగా సంసిద్ధం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లాలో ఈ నెల 8 నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ముథోల్ ఏరువాక, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య తెలిపారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో మే 8 నుంచి జూన్ 10 వరకు ఈ కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రైతుల వద్దకు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడుతారు. భూమిని పరీక్షించి, అధిక దిగుబడి వచ్చే విధంగా వేయాల్సిన పంటలు, అనుసరించాల్సిన పద్ధతులను వివరిస్తారని తెలిపారు. గ్రామాల్లో పర్యటించి రైతులు వానకాలంలో సాగు చేసే పంటల వివరాలు సేకరించడంతో పాటు ఏ పంటలు వేయాలి. ఎరువులు ఎలా వినియోగించాలి. మంచి దిగుబడి కోసం పంట ఏ దశలో ఉంటే ఏవిధమైన చర్యలు తీసుకోవాలన్న విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తారన్నారు. వెంకటాపూర్‌లో 8వ తేదీన నిర్వహించే అవగాహన సదస్సుకు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరు కానున్నట్లు తెలిపారు.

షెడ్యూల్ ఇదీ..

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 8న ముథోల్ మండలం వెంకటాపూర్, 15న తానూర్ మండలం దాగాం, 22న నిర్మల్ మండలం వెంగ్వాపేట్, 29న లోకేశ్వరం మండలం రాజుర, జూన్ 5న బాసర మండలం మైలాపూర్, జూన్ 10న కుంటాల మండలం అంబకంటి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులకు శాస్త్రవేత్తలు డా. నర్సయ్య, డా. విజయ్‌కుమార్, డా.కార్తీక్, డీఏవో అంజిప్రసాద్, వ్యవసాయశాఖ ఏవోలు, ఏఈవోలు హాజరవుతారని ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు.

తడి..పొడి మొక్కుబడి



కుభీర్‌లో వృథాగా మారిన షెడ్డు

కుభీర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : చెత్తను వృథాగా పడేయకుండా చక్కగా వినియోగించుకొని ఆదాయం సమకూర్చుకోవడచ్చని ప్రభుత్వం పంచాయతీలను నిర్ధేశించింది. అందులో భాగంగా ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్‌షెడ్లు నిర్మించారు. తడిపొడి, చెత్త విభాగాలను నెలకొల్పారు. పొడి చెత్తలోని గాజు సీసాలు, కాగితాలు, అట్టముక్కలు ఇనుప వ్యర్థలను వేరు చేయాలి. తడి చెత్తను ప్రత్యేక పద్ధతిలో నిల్వ చేసి కంపోస్టుల ఎరువుగా మార్చి విక్రయించి ఆదాయం గడించాలని సర్కారు ఆదేశించింది. చాలా చోట్ల పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు.

● ఆకతాయిలకు అడ్డాలుగా

మండలంలోని 42 గ్రామపంచాయతీలున్నాయి. దాదాపు అన్ని చోట్ల రూ.లక్షల్లో ఖర్చు చేసి కంపోస్టు షెడ్‌లు నిర్మించారు. మొదట్లో అధికారుల సూచనలతో కొన్ని చోట్ల ఎరువులు తయారు చేశారు. తరువాత ఉపయోగించక పోవడంతో షెడ్లు శిథిలావస్థకు చేరాయి. ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. 90 శాతానికిపైగా గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. చాలా గ్రామాల్లో తడి , పొడి చెత్తను వేర్వేరేగా సేకరించడం లేదు. కొన్ని చోట్ల గ్రామస్థులు చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసినా పంచాయతీ కార్మికులు మాత్రం ట్రాక్టర్ ట్రాలీల్లో వేయడంతో కలిసి పోతున్నాయి. రహదారుల పక్కన పెరుకుపోయిన చెత్త అక్కడే కాల్చేస్తున్నారు.


కొమురంభీం ప్రాంగణంలో ఐటీడీఏ ఏర్పాటు చేసిన పాడి పరిశ్రమ కేంద్రం


అలంకార ప్రాయంగా మారిన పశువుల షెడ్లు

పడకేసిన పాడి పరిశ్రమ!

• పట్టించుకోని అధికారులు • ప్రత్యామ్నాయ ఉపాధి కరువు

ఉట్నూర్, మే6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ఉట్నూర్ కేంద్రంగా ప్రారంభి సంమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురంభీం ప్రాంగణంలోని పాడి పరిశ్రమ అభివృద్ధి పథకాలు పడకేశాయి. లక్షల రూపాయలతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారగా పోకిరీలకు అడ్డాగా మారాయి.

• కరువైన ప్రత్యామ్నాయ ఉపాధి

ఐటీడీఏ ఏర్పాటు చేసిన ప్రభుత్వం గిరిజనులకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలని భావించింది. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఆధ్వర్యంలో అప్పటి ప్రాజెక్టు అధికారులు కొమురంభీం ప్రాంగణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, శిక్షణ కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పాడి పరిశ్రమ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఐటీడీఏలో ప్రత్యేకంగా సహాయ ప్రాజెక్టు అధికారి (పశుపోషణ) ఉండేవారు. ఆయన ఆధ్వర్యంలో ఇద్దరు వెటర్నరి డాక్టర్లతో పాటు కావాల్సిన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనులకు పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి గిరిజనులకు శిక్షణ అందించేవారు. శిక్షణ అనంతరం వారికి పాడి గేదెలు ఐటీడీఏ, బ్యాంకు వారి సహకారంతో మంజూరు చేసి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేవారు. అదే విధంగా కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాడి పరిశ్రమ అభివృద్ధి శిక్షణ కేంద్రంలో గిరిజనులకు శిక్షణ ఇవ్వడంతో పాటు గేదెలను పెంచి ఉట్నూర్ పట్టణంలోని ఉద్యోగులకు, ప్రజలకు, గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలలకు స్వచ్ఛమైన పాలు సరఫరా చేసేవారు. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన ప్రాజెక్టు అధికారులు ఈ విషయంలో శ్రద్ధ చూపక పోవడంతో పాటు ప్రభుత్వం కూడా పశు సంవర్ధక శాఖ అధికారులను ఐటీడీఏకు కేటాయించక పోవడంతో పాడి పరిశ్రమ పూర్తిగా పడకేసింది. దీంతో గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి కరువై పోగా కొమురంభీం ప్రాంగణంలో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన పాడి పరిశ్రమ షెడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరిపోగా అందులో ఉన్న పరికరాలు సైతం చెడిపోయాయి. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషిచేయాలని గిరిజనులు కోరుతున్నారు.


పిచ్చిమొక్కల మధ్య షెడ్లు


జిన్నింగ్ ఫ్యాక్టరీ ఎదుట తొట్టి వద్ద నీరు తాగుతున్న మేకలు

మూగజీవాలపై చల్లని చూపు

భైంసా, మే6 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండల ధాటికి విలవిలలాడుతూ నీటి కోసం పరితపిస్తున్న మూగజీవాలపై పట్టణంలోని రెండు సంస్థలు చల్లని చూపును చూపుతున్నాయి. స్థానిక ప్రధాన రోడ్డు మార్గంలోని నరసింహ జిన్నింగ్ ఫ్యాక్టరీ నిర్వాహకులు, గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గాను ప్రత్యేక చర్యలు చేపట్టాయి. వాటి దాహార్తిని తీర్చేందుకు తమ సంస్థల ముందు భాగంలో నున్న నీటి తొట్టీలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకవచ్చాయి. నెల రోజులుగా తొట్టీలలో అన్నివేళలా నీటిని నింపుతూ మూగజీవాల దాహార్తిని తీరుస్తున్నారు. సుద్దవాగు పరిసర ప్రాంతాలతోపాటు శివారు ప్రాంతాల్లోకి మేత కోసం వేళ్లే మూగజీవాలు ఉదయం, సాయంత్రం వేళలో రెండు సంస్థల ముందు భాగంలో గల తొట్టిలలోని నీటిని సేవిస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. రోడ్లపై సంచరించే పశువులు అన్నివేళల్లో ఈ తొట్టీలలోని నీటిని తాగుతుంటాయి. రెండు సంస్థల నిర్వాహకులు తొట్టీలలో నీటినిల్వలు ఎప్పుడు ఉండే విధంగా పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయిన తరుణంలో నీటి ఎద్దడి నెలకొని దాహార్తితో అలమటిస్తున్న మూగజీవాలకు నీరందిస్తున్నారు.


గీత పారిశ్రామిక సహకార సంఘం ముందు భాగంలో ఏర్పాటు చేసిన నీటితొట్టి

విద్యుత్ వినియోగం, భద్రతా చర్యలపై రైతులకు సూచనలు ఇవ్వాలి

ఉట్నూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకొని, రైతులకు, ప్రజలకు విద్యుత్ వినియోగంపై భద్రత చర్యలు వివరించాలని విద్యుత్ వరంగల్ సీఈ జైవంత్‌రావుచౌహాన్ అన్నారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం విద్యుత్ భద్రత వారోత్సవాలు పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం బుధవారం వరకు కొనసాగుతుందని అన్నారు. విద్యుత్ ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడంతో పాటు ఉద్యోగులు సైతం భద్రతగా ఉండాలని అన్నారు. రైతులకు, గృహ అవసరాల వినియోగదారులకు విద్యుత్ వినియోగం, భద్రత చర్యలపై సూచనలు, సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఉన్నత అధికారులతో పాటు ఉట్నూర్ డివిజనల్ ఇంజనీర్ సుభాష్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందచేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

విద్యార్థులు జీవిత లక్ష్యసాధనకు ప్రణాళికతో ముందుకు సాగాలి

• ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, మే6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ తమ జీవిత లక్ష్య సాధనకు ప్రణాళికతో ముందుకు సాగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజక వర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పది, ఇంటర్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నిర్వహించిన ఆత్మీయ అభినందన సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పది, ఇంటర్ ఫలితాల్లో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఫలితాల సాధన వెనుక ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయమైనదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అంకితభావంతో తోడ్పాటునిస్తానని వెల్లడించారు. వసతుల కల్పన, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపడుతానని పేర్కొన్నారు. విద్యార్థులు పది, ఇంటర్ ఫలితాలను స్ఫూర్తిగా తీసుకొని జీవిత లక్ష్య సాధన వైపు అడుగులు వేయలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలన్నారు. ఆత్మస్థైర్యమే ఆలంబనగా ముందుకు సాగాలన్నారు. చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతీ విద్యార్థి గుర్తు పెట్టుకోవాలన్నారు. నేటి పోటీ యుగంలో ధీటుగా రాణించి అగ్రగామిగా నిలువలాంటే కఠోర సాధన ప్రధానమన్నారు. చదువుతో పాటు విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు నిత్యం వ్యాయమం, యోగా సాధన, ధ్యానం చేయాలన్నారు. ఆటపాటల్లోనూ రాణించే దిశగా వ్యవహరించాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ పట్టుపెంపుదించుకోని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా అనసూయ పవార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పది, ఇంటర్ పరీక్షల్లో టాపర్లు నిలిచిన ప్రతీ పాఠశాల, కళాశాల విద్యార్థులకు, వారి తల్లితండ్రులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులుసన్మానించి జ్ఞాపికలు అందచేశారు. ఇందులో నియోజకవర్గ పరిధిలోని ఆయ మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, బీజేపీ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయ బృందాలు పాల్గొన్నాయి.


హాజరైన టాపర్ విద్యార్థులు, వారి తల్లితండ్రులు

భూ ప్రకంపానికి ఒరిగిన మర్రి చెట్టు


ఒరిగిపోయిన మర్రి చెట్టు

లక్ష్మణచాంద, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం సాయంత్రం వచ్చిన భూ ప్రకంపనలకు నర్సాపూర్(డబ్ల్యూ)లోని మర్రి చెట్టు ఒక వైపునకు వాలింది. జిల్లాలో కొద్ది సెకండ్ల పాటు వచ్చిన భూ ప్రకంపానికి వస్తువులు, కాళ్ల కింద ఉన్న భూమి కాస్త వణికినట్లు అనిపించి స్థానికులంతా ఆశ్చర్యానికి గురైన సంగతి అందరికీ తెలిసిందే. గ్రామ సమీపంలోని పెద్ద మర్రి చెట్టు ఉన్నచోట భూమి లోపల నుంచి ఒకవైపునకు ఒరిగినట్లు కనిపించిం ది. దీంతో గ్రామ స్థులు కొంత ఆందోళనకు గురయ్యారు.



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు


ధాన్యంపై కప్పేందుకు టార్పాలిన్లతో వెళ్తున్న రైతు

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

• కల్లాల్లో ధాన్యం కుప్పలు • ఆందోళన చెందుతున్న దిలావర్‌పూర్ రైతులు • గింజలను కాపాడుకునేందుకు నానా తిప్పలు

దిలావర్‌పూర్, మే6 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయంటే చాలు అన్నదాతల్లో గుబులు మొదలవుతోంది. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమవుతూ రైతులను ఆగమాగం చేస్తోంది. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు చేతికొచ్చే తరుణంలో చెడుగొట్టు వానలు రైతులకు కంటిమీద కునుకు లేకుండాచేస్తున్నాయి. మండలంలో మక్క, జొన్నకోతలు పూర్తికాగా, యాసంగి వరి కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. మక్కలు, జొన్నలు కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోశారు. వరిధాన్యం సైతం రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకవస్తున్నారు. ఇదే సమయంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో బలమైన ఈదురుగాలులతోపాటు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతుల గుండెల్లో గుబులు రేగుతోంది. రైతుల్లో గుబులు మొదలవుతోంది. అకస్మాత్తుగా వస్తున్న బలమైన గాలులతో కూడిన ఓ మాదిరి వర్షం పడటంతో రైతులు కల్లాల్లో కుప్పలుగా పోసిన మక్కలు, వరిధాన్యం కాపాడుకునేందుకు నానా తిప్పలు పడ్డారు. టార్పాలిన్‌లను ఆగమేఘాలపై కుప్పలపై కప్పారు. అయితే బలమైన గాలులకు టార్పాలిన్‌ను లేచిపోవడంతో రైతులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి. ఇక్కడ కోత పూర్తయి కల్లాల్లో ఉన్నా ధాన్యం దెబ్బతిని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చెడగొట్టు వానలతో భయంగా ఉంది

• నడ్పి ముత్యం, రైతు, దిలావర్‌పూర్



యాసంగిలో సాగుచేసిన వరిపొలం హార్వెస్టర్ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చాను. ఈ చెడగొట్టు వానలు ఎప్పుడు పడతాయో తెలియదు. మబ్బులను చూస్తే చాలు భయమేస్తోంది. తొందరగా కాంటా చేస్తే బాగుంటుంది.

నత్తనడకన మల్టీపర్పస్ భవన నిర్మాణం

• పత్తా లేని కాంట్రాక్టర్ • పట్టించుకోని అధికారులు • ఆందోళన చెందుతున్న ఆదివాసీ గిరిజనులు

తలమడుగు, మే6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసీ కోలం గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల వ్యయంతో సంక్షేమ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తున్నా కొంత మంది అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో ప్రయోగనం లేకుండా పోతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తలమడుగు మండలంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ ద్వారా మల్టీపర్పస్ భవన నిర్మాణం కోసం తలమడుగు మండలంలో కోటీ 80లక్షల వ్యయంతో మండలంలోని నర్సాపూర్, సోనాపూర్, రేకుల గూడా గ్రామాల్లో ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.60లక్షలు వెచ్చించారు. జనవరి మాసంలో ప్రజాప్రతినిధులు భూమిపూజ చేసి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ఐదు నెలలుగా భవన నిర్మాణ పనులు కేవలం బేస్మెంట్ పిల్లర్లకే పరిమితం కావడంతో ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా నిర్మాణంలో చేపట్టే సిమెంటు మట్టితో కూడిన నల్లటి ఇసుకను ఉపయోగిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. అంతేకాకుండా చేపట్టిన బేస్మెంట్ పిల్లర్లకు క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడంతో పగులు తెలియని ఆదివాసి గిరిజనులు తెలిపారు. ఆదివాసి గిరిజనగ్రామాల్లో చేపడుతున్న పనులపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమైతే పనులు జరగడం కష్టమవుతుందని గిరిజనులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆదివాసి గిరిజన గ్రామాల్లో చేపడుతున్న మల్టీపర్పస్ సముదాయ భవననిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని ఆదివాసి గిరిజనులు కోరుతున్నారు.


నర్సాపూర్‌లో చేపడుతున్న భవనానికి క్యూరింగ్ సక్రమంగా చేయక పోవడంతో పగుళ్లు తేలిన దృశ్యం


జర దేఖో!!



పిల్లర్లకే పరిమితమైన నర్సాపూర్ గిరిజన గ్రామంలో చేపడుతున్న మల్టీపర్పస్ భవనం

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

సోనాల, మే6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను కూలీలందరు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎంపీడీఓ రమేష్ సూచించారు. మంగళవారం మండలంలోని చింతలబోరి, పార్డి(కె) సోనాల, గ్రామ శివారుల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల నమోదు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.







డ్రగ్స్ కట్టడి
కట్టుదిట్టం

- జిల్లాలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రహరీ కమిటీల ఏర్పాటు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో అమలు
- అంతటా విస్తృత అవగాహన కార్యక్రమాలు
- ప్రత్యేక కౌన్సెలింగ్‌లు

గత కొంత కాలం నుంచి విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారి పోతున్న అంశాన్ని విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంటోంది. విద్యా సంస్థలు వాటి పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యార్థులు పరిసర ప్రాంతాల్లో ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ టేలాల నుంచి ఈ మత్తు పదార్థాలను కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు, యువకులు గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వికృత చేష్టలు చేస్తున్నారు. సెలవు దినాల్లో చాలా మంది విద్యార్థులు గంజాయి మత్తులోనే జోగుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. అయితే ఇప్పటికే పలుసార్లు పాఠశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు ఆరోగ్యపరమైన నష్టాలపై కౌన్సిలింగ్‌లు నిర్వహించినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. దీంతో గత రెండు నెలల క్రితం విద్యాశాఖ మత్తు పదార్థాలకు బానిసలైన విద్యార్థులను విముక్తులను చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ప్రతి పాఠశాలలో ప్రహరీక్లబ్‌ల పేరిట ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన గైడ్ లైన్స్‌ను కూడా జిల్లా విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలలకు జారీ చేసింది. అయితే ఈ కమిటీల ఏర్పాటులో ఆలస్యం కావడంతో కలెక్టర్ దీనిపై దృష్టి సారించి వెంటనే కమిటీలను ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా కమిటీలను ఏర్పాటు చేసి దీనికి సంబంధించిన నివేదికలు తనకు అందజేయాలంటూ కలెక్టర్ సూచించారు. దీంతో అన్ని పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది.

కమిటీల పాత్ర కీలకం..

ప్రహరీక్లబ్‌ల పేరిట ఏర్పాటు చేస్తున్న కమిటీలకు విద్యాశాఖ కీలక బాధ్యతలు అప్పజెప్పింది. ప్రహరీక్లబ్ కమిటీ సభ్యులు విద్యార్థులను, స్థానిక యువకులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే కాకుండా వారు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడడంతో పాటు గంజాయి ఇతర మత్తు పదార్థాలను నివారించాల్సి ఉంటుంది. పాఠశాల పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు విక్రయించే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించడం, వాటిని అమ్ముకున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మరోసారి అమ్మకుండా నివారించడం లాంటి బాధ్యతలను చేపట్టాల్సి ఉంటుంది. వారంలో ఒకటి రెండు రోజులు ప్రహరీక్లబ్‌ల పేరిట విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని గైడ్ లైన్స్‌లో పేర్కొన్నారు. ఈ కమిటీలో ఓ పోలీస్ కానిస్టేబుల్ కూడా సభ్యుడుగా ఉన్నందున ఆయన ద్వారా ఎప్పటికప్పుడు పోలీసుశాఖ సహకారం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. స్థానికంగా అవగాహన ర్యాలీలు, సమావేశాలు జరిపి మత్తు పదార్థాలతో జరిగే నష్టాలను వివరించాల్సి ఉంటుంది.

ఇక నుంచి విద్యార్థులకు కౌన్సెలింగ్

గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులను గుర్తించి టీచర్లు వారికి కౌన్సిలింగ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కనీసం 15 రోజులకోసారైనా స్థానికంగా ఉన్న సైకాలజిస్ట్‌ల చేత కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలను కూడా చేపట్టనున్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి బహిరంగంగా కాకుండా ప్రత్యేకంగా కౌన్సిలింగ్‌లు నిర్వహించనున్నారు. ఇతర విద్యార్థులకు మత్తు పదార్థాలతో జరిగే దుష్పరిణామాలపై వివరించనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు తల్లిదండ్రుల సహకారం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలను కూడా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీల సందర్భంగా భాగస్వాములను చేయనున్నారు.

కమిటీల రూపకల్పన ఇలా..

ప్రహరీ క్లబ్ కమిటీల ఏర్పాటును పకడ్బందీగా చేపడుతున్నారు. ఈ క్లబ్‌ల ప్రెసిడెంట్‌గా స్థానిక పాఠశాల హెడ్‌మాస్టర్ లేదా ప్రిన్సిపాల్, వైస్ ప్రెసిడెంట్‌గా పాఠశాల సీనియర్ టీచర్ లేదా విద్యార్థులతో సన్నిహితంగా ఉండే టీచర్‌ను నియమించనున్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను నియమిస్తారు. ప్రతి తరగతి నుండి ఇద్దరు చొప్పున విద్యార్థులకు కమిటీలో చోటు కల్పించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒకరిని స్థానిక పోలీస్ కానిస్టేబుల్ నియమిస్తున్నారు.

నిర్మల్, మే 6 (ఆంధ్రజ్యోతి)

నేడు కొలువు దీరనున్న కాల్వ లక్ష్మీ నరసింహస్వామి
దేవస్థానం కొత్త పాలక వర్గం

దిలావర్‌పూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కాల్వ అడవుల్లో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, మాజీ కేంద్ర మంత్రి డా. వేణుగోపాల చారి, రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

భారత్ గౌరవ్ ట్రైన్‌యాత్రపై అవగాహన కల్పించండి

నిర్మల్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : భారత రైల్వే శాఖ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు భారత్ గౌరవ్ ట్రైన్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయా జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ఎంపీలకు, జడ్పీ ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, విస్తృత ప్రచారం నిర్వహించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దేశంలోని 22 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ యాత్ర 26 ట్రిప్పులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాలు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 24న హరిద్వార్, రుషికేశ్, వైష్ణవి దేవి యాత్ర, కాశీ, మే 8న గయా, 22న అరుణాచలం, జూన్ 4న జ్యోతిర్లింగ యాత్ర 4 ప్యాకేజీలుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని కోరారు. వివరాలకు రైల్వేశాఖ ఫోన్‌నెంబర్ 04027702407, 92814595843ల ద్వారా సమాచారం తెలుసుకోవచ్చునని తెలిపారు.

గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

భైంసా రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాటేగాం గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీపీవో శ్రీనివాస్ శ్రీనివాస్ సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని డ్రైనేజీ, ప్రకృతి వనం, సెగ్రిగేషన్ నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని మొక్కలకు ప్రతిరోజు నీరు అందించాలన్నారు. ప్రతిరోజు ఆన్‌లైన్‌లో రికార్డులు పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విమల, కారోబార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో రెండిళ్లలో దొంగతనం

సోన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి రెండు ఇళ్లలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్సై కే. గోపి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్‌అక్బర్ సోమవారం రాత్రి తన ఇంటి స్లాబు పై నిద్రపోయాడు. అయితే ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారం, పదితులాల వెండితో పాటు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామానికి చెందిన భారతి భర్త గల్ఫ్‌లో ఉండటంతో పక్కింటిలో పడుకునేందుకు వెళ్లగా దొంగలు వీరి ఇంట్లోకి చొర బడి బంగారం ఎత్తుకెళ్లినట్లు వివరించారు. సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై గోపిలు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి


- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్



మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో బాలింతలతో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మంగళవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. ఆరోగ్యకేంద్రంలో అడ్మిట్ అయిన పలువురు గర్భవతులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న ఆహారంపై వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, నర్సింగ్ సూపరిండెంట్ సహస్ర, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత దాడి ప్రదేశాన్ని పరిశీలించిన ఎఫ్‌బీవో



చిరుతదాడి చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో సాయిరెడ్డి

నర్సాపూర్(జి), మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం గొర్రెలపై చిరుతదాడి చేసింది. మంగళవారం ఎఫ్‌బీవో (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్) సాయిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుతపాద ముద్రలు సేకరించామని, ప్రజలు అటవీ ప్రాంతంలో ఒంటరిగా తిరగవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్ట్

నిర్మల్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌పై వెళ్తున్న దంపతులను అడ్డగించి, బాధితుడి మెడలోని బంగారు చైన్‌ను, బాధిత మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంగళవారం ఇన్‌చార్జ్ ఏఎస్పీ అవినాష్‌కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల ఏప్రిల్ 30వ తేదీన రాత్రి ఇద్దరు దంపతులు మోటార్ సైకిల్‌పై నిర్మల్ నుంచి వెంగ్వాపేట్‌కు వెళ్తున్న క్రమంలో కవేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారి మోటార్‌సైకిల్‌ను అడ్డగించి, బాధితుడి మెడలోని బంగారుచైన్‌ను, మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించి, వెంట తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు కేసునమోదు చేసుకున్న రూరల్ పోలీసులు చైన్‌స్నాచింగ్ దొంగల కోసం విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంజులాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు పట్టుకొని విచారించగా నాందేడ్ జిల్లా సోనారి తాలూకా, పొన్నాలకు చెందిన పర్బాజీ బాలాజీ రేల్వాడ్, రూరల్ మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్ అని తెలిసింది. పూర్తి విచారణలో ఫిర్యాదుదారుడి మెడలోంచి బంగారు చైన్ ఇంకా మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీ చేసింది తామేనని నిందితులిద్దరూ అంగీకరించారు. వారి వద్ద నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, ఒక తులం బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ సంతోష్, సత్యనారాయణలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

స్వయం ఉపాధికి కార్యాచరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసం పథకంపై ఆయా శాఖల అధికారులతో ఆమె సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, ఎకానమిక్ సపోర్ట్ స్కీమ్‌లను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి ఈ నెల 20వ తేదీలోగా జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ ఉన్న యూనిట్లను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

దరఖాస్తు పరిశీలనకు బ్యాంకులు వేగంగా స్పందించాలని, రోజువారి నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ అభి ప్రాయపడ్డారు. అనంతరం మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, ఇప్పటి వరకు వాటి పరిశీలన స్థితి, బ్యాంకుల వారీగా టార్గెట్లు తదితర అంశా లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో స్థాని క సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎల్‌డీఎం రాంగోపాల్, మండ లాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వివిధ బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్



సూర్యాపూర్ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్

కుంటాల, మే, 6 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం భూ భారతి పథకంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని లింబా(బీ), సూర్యాపూర్, అంబకంటి గ్రామాలలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ సూర్యాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యలను తేలికగా పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ భూ భారతి పథకాన్ని ప్రవేశ పెట్టిందని కావున ఏవైనా భూ సమస్యలు ఉన్న రైతులు ఈ రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలపై తమ సిబ్బంది పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఈ సదస్సులో భూ రికార్డులలో విస్తీర్ణం, పేరు లోపాలు, వారసత్వ భూములు, భూ స్వభావం, నిషేధిత జాబితాలోని భూముల సర్వేనెంబర్ల లోపాలు, పట్టాపాసు బుక్ లేని భూములు, సాదాబైనామాలు, హద్దుల సమస్యలు, పార్ట్ బి భూములు, భూ సేకరణ కేసులపై దరఖాస్తులు స్వీకరించిన నూతన ఆర్‌వోఆర్ ప్రకారం విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పలు రకాల భూ సమస్యల గురించి అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్‌లు కమల్‌సింగ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, డీటీ నరేష్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భోసి గ్రామంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

- బాలిక మేజర్ అయ్యే వరకు వివాహం జరపబోమని అధికారులకు హామీ ఇచ్చిన కుటుంబ సభ్యులు



కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్న బాలల సంరక్షణ అధికారులు

తానూర్ , మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భోసి గ్రామంలో బాల్య వివాహం జరుగబోతోందన్న సమాచారం అందుకున్న బాలల పరిరక్షణ శాఖ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఓ 14ఏళ్ల మైనర్ బాలికకు కుటుంబ సభ్యులు వివాహం జరుపుతున్నట్లు తెలుసుకున్న బాలల సంక్షేమ శాఖ, పోలీసుశాఖ, అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వివాహాన్ని నిలిపి వేశారు. ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి బాల్య వివాహం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఇద్దరు కుటుంబాల నుంచి బాలిక మేజర్ అయ్యే వరకు వివాహం జరిపించబోమని హామి పత్రాలు రాసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సీడీపీవో సరోజిని, ఏసీడీపీవో నాగలక్ష్మి, బాల పరిరక్షణ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



పోతన్న మృతదేహం

తానూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన బొడ్డోళ్ల పోతన్న(53) అనే రైతు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రైనీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం... పోతన్నకు రెండు ఎకరాల భూమి ఉంది. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండక పోవడంతో అప్పులు కాగా.. అప్పులు ఎలా తీర్చాలని మనస్థాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున తన చేనులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రుక్మాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి మృతి



సూర్యవంశీ ప్రసాద్ (ఫైల్)

భైంసా రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండెగాం గ్రామానికి చెందిన సూర్యవంశీ ప్రసాద్(49) ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యవంశీ ప్రసాద్ ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై తనలో తానే మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి తన జొన్న పంటకి కాపలాగా ఉంటానని తన భార్యతో చెప్పి వెళ్లాడు. మంగళవారం గుండెగాం గ్రామ శివారులో గల చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఉన్న ప్రసాద్ మృతి దేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల్‌చందా గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు తాండ్ర రాజేశ్వర్, బండల మీది మోహన్, తదితరులు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై దాడి అమానుషం

నిర్మల్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్‌పై దాడి చేయడం అమానుషమని జిల్లా తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం పేర్కొంది. అధ్యక్షుడు పీజీ రెడ్డి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో గిరిజన అధికారిపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడ్డ వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై దాడులు చేసే సంప్రదాయం సరికాదని హేయనీయ చర్యగా అభివర్ణించారు.